క్లుప్తంగా

గుంతలు పూడ్చిన పోలీసులు



శాయంపేట : రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను స్థానిక పోలీస్‌లు పూడ్చివేశారు. దీంతో వాహనదారులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. పరకాల–హనుమకొండ మాందారిపేట మలుపుల నేషనల్ హైవేపై గుంతలు ఏర్పడగా సీఐ రంజిత్‌రావు దృష్టి సారించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా సాయిదత్త క్రషర్ సహకారంతో కంకర, మట్టితో గుంతలు పూడ్చివేయించారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన కొండమీది పద్మ (40) అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తిచెంది ఇటీవల గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కాగా ఆమె చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పద్మ గత కొంత కాలంగా నడుం నొప్పి, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఆ బాధలు భరించలేని ఆమె ఈనెల 19వ తేదీన గడ్డిమందు తాగింది. కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. ఐనప్పటికీ పద్మ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో ఈనెల 23వ తేదీన తిరిగి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు చెప్పారు. మృతురాలికి భర్త, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. మృతురాలి భర్త సీతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేర్చాలి

గీసుకొండ : ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి చేర్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మత్స్య పారిశ్రామిక సొసైటీని ఏర్పాటు చేసి రూ. వెయ్యి కోట్లు మంజూరు చేయాలని, అందులో ముదిరాజ్‌లకు 75 శాతం సబ్సిడీతో నిధులను రాష్ట్రం ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. మహాసభ మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి, ఎస్‌ఆర్‌ఐ విభాగం రాష్ట్ర కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, నీరటి సదానందం, బొప్పడి సోమయ్య, కంబాల కోటి, ఎంబాడి నర్సింహరాములు, రఘు, ఉపేందర్, ఉడుతబోయిన వేణు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్‌పై చర్య తీసుకోవాలి

సంగెం : రైతుల నుంచి బలవంతంగా వ్యక్తిగత ఇన్సూరెన్స్‌లు తీసుకుంటున్న గవిచర్ల గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా కమిటీ నాయకుడు ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన తహసీల్దార్‌కు వినతిప్రతం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు రుణాలు రెన్యూవల్ చేసుకుంటున్నపుడు తెలియకుండానే వ్యక్తిగత ఇన్సూరెన్స్ కోసం డబ్బులు కట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీని ఎలాంటి పాత బకాయిగాని, మరే ఇతరాలకు కట్ చేసుకోకుండా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఖాతరు చేయడం లేదని విమర్శించారు. సంబంధిత అధికారులు స్పందించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న సదరు బ్యాంకు మేనేజర్‌పై చర్య తీసుకుని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గోనే రాంచందర్, మండల ఐలయ్య, రౌతు శ్రీనివాస్, రాగి రవి తదితరులు పాల్గొన్నారు.

మడేలయ్యకు ప్రత్యేక పూజలు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలో రజకులు బుధవారం తమ ఇష్టదైవమైన మడేలయ్య బోనాల పండుగను నిర్వహించారు. ఈ మేరకు ఊర చెరువు వద్దగల మడేలయ్య ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలతో వచ్చి మొక్కులు చెల్లించారు. గట్టికొప్పుల రాజు పాల్గొన్నారు.

పరామర్శ

రాయపర్తి : తిర్మలాయపల్లికి చెందిన కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు జినుగు రత్నాకర్‌రెడ్డిని బుధవారం ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతుండగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, పాలకుర్తి సోమేశ్వరాలయ చైర్మన్ తిరుమల కృష్ణమాచార్యులతో పాటు నాయకులు పరామర్శించారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆదేశాల మేరకు పరామర్శించినట్లు తెలిపారు.

తెలంగాణకు కేంద్రం మొండిచెయ్యి

- భగ్గుమన్న వామపక్షాలు
- నిరసనల హోరు.. దిష్టిబొమ్మల దహనం
- తెలంగాణ బీజేపీ ఎంపీలు సమాధానం చెప్పాలని డిమాండ్

ఎల్కతుర్తి : పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మొండిచెయ్యి చూపిందని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదారి శ్రీనివాస్ మండిపడ్డారు. ఈ మేరకు భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని అంబేద్కర్ చౌక్‌వద్ద హనుమకొండ– సిద్దిపేట ప్రధాన రహదారిపై సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తీసుకురాని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్రమోదీ తన పదవిని కాపాడుకునేందుకే ఏపీకి 15వేల కోట్లు, బీహార్‌కు 26వేల కోట్లు కేటాయించినట్లు విమర్శించారు. విభజన చట్టంలో ఏ ఒక్క అంశానికి కూడా నిధులు కేటాయించలేదన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలను ఇచ్చినా రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడం అన్యాయమని అన్నారు. కేంద్రం తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ బడ్జెట్ పత్రాలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొంగల రామ్‌చంద్రారెడ్డి, మంచాల తిరుపతి, ఆదారి రమేశ్, సుంచు కుమారస్వామి, సన్నీల రవి, చందు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

ఐనవోలు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే విధంగా ఉందని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు.



ఎల్కతుర్తి : ధర్నాకు దిగిన సీపీఐ నాయకులు

బీజేపీకి తెలంగాణ నుంచి 8 మంది ఎంపీలు ఉన్నప్పటికీ కేంద్రం మొండి చెయ్యి చూపిందన్నారు. కేంద్రం నుంచి నిధులు రాకపోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో

ఆత్మకూరు : మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేశారని నినాదాలు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, నాయకులు సుధాకర్‌రెడ్డి, రాజు, వాసు, స్వామి, కుమారస్వామి, జయపాల్‌రెడ్డి, సందీప్, బాబుమియా, వేణు, సదయ్య పాల్గొన్నారు.

పరకాలలో..

హన్మకొండ (పరకాల) : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండిచెయ్యి చూపించిందని నిరసిస్తూ పరకాల పట్టణంలో కాంగ్రెస్ నాయకులు బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ఎంపీలు 8 మంది ఉన్నప్పటికీ ఏలాంటి నిధులు తీసుకురాకపోవడం సిగ్గుచేటన్నారు. భవిష్యత్‌లో బీజేపీ సర్కార్‌కు తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్స్ సంపత్‌కుమార్, జయమ్మ, అనిల్, రాజు, మాజీ ఎంపీపీ రాంమూర్తితో పాటు తదితర నాయకులు పాల్గొన్నారు.



హన్మకొండ (పరకాల) : కేంద్రం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఆత్మకూరు : నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

శాయంపేటలో..

శాయంపేట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండిచెయ్యి చూపించిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి విమర్శించారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని మండిపడ్డారు. విభజన హామీలకు నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం ఎన్డీయే కూటమి పార్టీల ప్రభుత్వాలను సంతృప్తి పరిచే విధంగా బడ్జెట్ కేటాయింపు చేసినట్లు ఆరోపించారు. మాజీ జెడ్పీటీసీ చక్రపాణి, నాయకులు రవి, కుమారస్వామి, వలిహైదర్, భాస్కర్, కృష్ణమూర్తి, సాంబయ్య, ప్రపంచరెడ్డి, సతీష్, కట్టయ్య, దిలీప్, చిరంజీవి పాల్గొన్నారు.

పెద్ద చెరువుకు ప్రమాదమేమీ లేదు

- గండిపడిన మత్తడి పరిశీలన

సాక్షి స్పందన

కమలాపూర్ : మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్టకు ప్రమాదమేమీ లేదని, రైతులు ఆందోళన చెందవద్దని నీటి పారుదల శాఖ ఏఈ అనిల్‌రెడ్డి తెలిపారు. ప్రమాదపుటంచున కమలాపూర్ పెద్ద చెరువు ఉందని ఈనెల 5న సాక్షిలో ప్రచురితమైన 'ఉండేనా.. ఊడేనా..?' కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు నీటి పారుదల శాఖ ఏఈ అనిల్‌రెడ్డితో కలిసి బుధవారం ఎంపీడీఓ గుండె బాబు పెద్ద చెరువును, గండిపడిన మత్తడిని పరిశీలించారు. పెద్ద చెరువు కట్టకు ఎలాంటి ప్రమాదం లేదని, గండిపడిన మత్తడి పూర్తిస్థాయి మరమ్మతుకు రూ.27 లక్షలు అవసరమని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించినట్లు ఏఈ తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అప్పటి వరకు ఇసుక సంచులతో మత్తడి గండిని తాత్కాలికంగా పూడ్చివేస్తామని తెలిపారు. హుజూరాబాద్, పెద్దపాపయ్యపల్లి తదితర ప్రాంతాల నుంచి పెద్ద చెరువుకు వచ్చే నీటిలో ఎక్కువ భాగాన్ని ఉప్పల్ పెద్ద చెరువుకు వెళ్లేలా మళ్లించినట్లు అధికారులు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.



గండిపడిన మత్తడిని పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగించాలి

- మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి

కమలాపూర్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్యంపై పేద ప్రజలకు నమ్మకం కలిగించాలని మండల ప్రత్యేకాధికారి గూడూరు రాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నేరుగా పేషెంట్ వార్డులోకి వెళ్లి పేషెంట్లకు వైద్యం సరిగా అందుతుందా? లేదా? వైద్యులు కేర్ తీసుకుంటున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నందున వైద్యులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఆయా ఆస్పత్రుల రికార్డులు పరిశీలించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ నరేష్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పేషెంట్‌తో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాంరెడ్డి

అర్హులైన మహిళా సంఘాలకు రుణాలు

- మున్సిపల్ కమిషనర్ నర్సింహ

హన్మకొండ (పరకాల) : ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా అర్హులైన వారికి ఋణాలు మంజూరు చేసేందుకు పరకాల ఎస్‌బీఐ (ఏడీబీ) అధికారులు సిద్ధంగా ఉన్నారని, అదే విధంగా పరకాల కొత్త మున్సిపల్ కార్యాలయంలో క్యాంటిన్ ఏర్పాటుకు ఉత్సాహవంతులైన మహిళా సంఘాల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నర్సింహ పేర్కొన్నారు. పరకాల మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం మహిళా సంఘాలతో పాటు మెప్మా, ఆర్పీలతో, ఓబీలు, బ్యాంక్ అధికారులతో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమానికి సంబంధించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడతూ.. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ప్రవేశపెట్టిన 14 పథకాలకు అర్హులైన మహిళా సంఘం సభ్యుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయం, ప్రభుత్వ ఆస్పత్రి, మున్సిపల్ కార్యాలయంలో ఎక్కడైనా అందించవచ్చని పేర్కొన్నారు. అనంతరం మెప్మా ఏడీఎంసీ సతీశ్ మాట్లాడుతూ.. చిరువ్యాపారులకు సంబంధించి ఐదుగురు సభ్యులతో (కామన్ ఇంట్రెస్ట్ గ్రూపు) గ్రూపులను ఏర్పాటు చేయాలని మహిళా సంఘాల ఆర్పీలకు సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో పరకాల ఎస్‌బీఐ (ఏడీబీ) మేనేజర్ సతీశ్, ఏపీజీవీబీ మేనేజర్ శ్రీనివాస్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ యాకన్న, ఫీల్డ్ ఆఫీసర్ శరత్ చంద్ర , మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.



మహిళా సంఘాల నాయకురాళ్లతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నర్సింహ

పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీ



వేలేరు (ధర్మసాగర్) : పెద్దమ్మతల్లి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. తాళం పగలగొట్టి సుమారు రూ.67,400 విలువ చేసే బంగారు ముక్కుపుడక, పుస్తేమట్టేలు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన ధర్మసాగర్ మండలంలోని పెద్దపెండ్యాలలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దమ్మతల్లి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పిట్టల అశోక్ రోజుమాదిరిగానే మంగళవారం రాత్రి 8.30 గంటలకు గుడిని శుభ్రం చేసి తాళం వేసి ఇంటికెళ్లాడు. బుధవారం ఉదయం కమిటీ సభ్యుడైన పిట్టల వెంకటేశ్వర్లు, అశోక్ ఇంటి వద్దకు వెళ్లి గుడి తాళం తీసుకుని గుడికెళ్లగా గేటుకు వేసి ఉన్న తాళం ధ్వంసమై కనిపించింది. దీంతో అతడు అశోక్‌కు సమాచారం అందించాడు. హడావుడిగా గుడి వద్దకు చేరుకున్న అశోక్ లోనికెళ్లి చూడగా అమ్మవారి మెడలోని బంగారు పుస్తేలు, ముక్కుపుడక, నాలుగు వెండి మట్టెలు కనిపించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి కాజీపేట ఏసీపీ తిరుమల్‌రావు, ధర్మసాగర్ సీఐ మహేందర్ చేరుకుని క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తిచేయాలి



మోడల్‌స్కూల్‌లో కొనసాగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాబు

కమలాపూర్ : మండలంలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓ గుండె బాబు వర్క్స్ కమిటీ చైర్మన్‌ను ఆదేశించారు. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో రూ.14 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను పంచాయతీరాజ్ శాఖ ఏఈ మధు, స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనితతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం వర్క్స్ కమిటీ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం కన్నూరు, కొత్తపల్లి, గుండేడు గ్రామాలను సందర్శించి పారిశుద్ధ్యం, వన మహోత్సవ పనులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు ఉదయాన్నే గ్రామాలను సందర్శించి రోడ్లు, డ్రెయినేజీలు శుభ్రం చేయించి బయోటిక్ స్ప్రే చేయించాలని, దోమల నివారణకు తప్పనిసరిగా ఫాగింగ్ చేయించాలని ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లా కలెక్టర్ నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని అన్నారు. కొత్తపల్లిలో మట్టి, బండలతో ఉన్న డ్రెయినేజీని త్వరితగతిన శుభ్రం చేయాలని, గుండేడులో పారిశుధ్యం సరిగా లేదని పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీఓ రమేశ్, కార్యదర్శులు రాజు, కుమారస్వామి, ఈజీఎస్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



వేలేరు : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మండల తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో బుధవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ పోరాటం చేస్తోందన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కోమల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు భానుప్రసాద్ రెడ్డి, ప్రధానకార్యదర్శి సమ్మయ్య, నాయకులు ప్రభాకర్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్, మాలకొండ రెడ్డి, రాజన్న, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

ఆత్మకూరు : ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు వస్తుందని ఎంఈఓ రమాదేవి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి పదోన్నతిపై బదిలీ అయిన లక్ష్మణరావును బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఏ పాఠశాలలో పనిచేసినా పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తే వారు కలకాలం గుర్తుంచుకుంటారని అన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం నిర్మలకుమారి, ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, పుష్పలత, సోమయ్య పీఎస్ హెచ్‌ఎం పాల్గొన్నారు.



లక్ష్మణరావును సన్మానిస్తున్న ఎంఈఓ రమాదేవి, ఉపాధ్యాయులు

పెచ్చులూడుతున్నాయ్..



పెచ్చులూడి ఇనుపచువ్వలు తేలిన పంచాయతీ భవనం

వేలేరు : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి కార్యాలయంలోని సర్పంచ్ గది పైకప్పు పెచ్చులుడిపోయి ఇనుపచువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. అలాగే గోడలు పగుళ్లు తేలి ప్రమాదకరంగా మారాయి. అదే విధంగా మండల కేంద్రంలోని బాలవికాస వాటర్‌ప్లాంట్ పక్కనున్న వాటర్‌ట్యాంక్ పిల్లర్లు పెచ్చులూడిపోయాయి. సుమారు 90 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్.. పిల్లర్లు పెచ్చులూడిపోయి ఇనుప చువ్వలు తేలాయి. దీంతో అవి ఎప్పుడు కూలుతాయోనని స్థానికులు భయాందోళ చెందుతున్నారు.



ఇనుపచువ్వలు తేలిన వాటర్‌ట్యాంకు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పాతటైర్లను తొలగిస్తున్న వైద్యసిబ్బంది

ఎల్కతుర్తి : మండలంలోని ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ రహమాన్ సూచించారు. బుధవారం భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలో వంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితుల సర్వే నిర్వహించారు. జ్వరం ఉన్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. దోమల వలన వ్యాపించే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు గురికాకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. రహదారులు, ఇంటి పరిసరాల్లో ఉన్న టైర్లు, కొబ్బరిచిప్పలు, ప్లాస్టిక్ వస్తువులను దూర ప్రదేశాల్లో పడేయాలని సూచించారు. అలాగే ఇంటి పరిసరాల్లో వరదనీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది కెఎల్‌ఎన్ స్వామి, స్వరూప, రాజమణి, సునిత, వసంత, కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తుకు బానిస కావొద్దు : సీఐ

వేలేరు (ధర్మసాగర్) : విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిక కావద్దని ధర్మసాగర్ సీఐ మహేందర్ సూచించారు. మండలంలోని పెద్దపెండ్యాల ఉన్నత పాఠశాలలో బుధవారం డ్రగ్స్ నివారణపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని పెట్టుకుని దాన్ని ఛేదించేందుకు కష్టపడాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ అమ్ముతున్నట్లు, వాడుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. సోషల్ మీడియాతో జాగ్రత్త ఉండాలని అన్నారు. గుర్తుతెలియని ఆప్‌లు, ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్, అరుణ, శ్రీనివాస్‌రెడ్డి, నరహరి, కరుణ, అంజయ్య సునిత, రాజన్నతో పాటు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మహేందర్

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



ఎల్కతుర్తి : కేక్ కట్‌చేస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : మండల కేంద్రంలో బుధవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారకరామారావు జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రయాణికులకు స్వీట్స్, పండ్లు పంపిణీ చేశారు. సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, వైస్ చైర్మన్ శెషగిరి, మాజీ ఎంపీపీ మేకల స్వప్న, నాయకులు తంగెడ నగేష్, పిట్టల మహేందర్, తంగెడ మహేందర్, గోల్లె మహేందర్, ఎల్తూరి స్వామి, రాజు, కొమురయ్య, సతీష్, చిట్టి గౌడ్, సాంబమూర్తి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పరకాలలో..

హన్మకొండ (పరకాల) : మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను పరకాల పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు.



శాయంపేటలో..

ఆత్మకూరులో..

ఆత్మకూరు : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించారు.

శాయంపేటలో..

శాయంపేట : మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామరావు జన్మదిన వేడుకలు బుధవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. మాజీ ఎంపీపీ తిరుపతిరెడ్డి కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నేరేడుపల్లిలో సిరకొండ యువసేన సభ్యులు మొక్కలు నాటారు.

మహా ధర్నాను జయప్రదం చేయాలి



శాయంపేట : ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా ఆగస్టు 9న జరిగే మాదిగల మహా ధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రేణికుంట కొమురయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో మాదిగల మహా ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. కేంద్రంలో అధికారం చేపట్టిన 100రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై ఊసెత్తడం లేదని మండిపడ్డారు. ఎస్సీల్లో ఉన్న 59 ఉపకులాల రిజర్వేషన్‌ను సమానంగా కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మస్కే సదయ్య, దైనంపల్లి రాజేశ్, చిలకల గోపి, శనిగరపు క్రాంతి, సమన్, అరుణ్, రమేశ్, అశోక్ పాల్గొన్నారు.